సాక్షి నిజామాబాద్

గురువారం, 8, ఆగస్టు, 2024



కాపర్ కేటుగాళ్లు..

నెల రోజుల వ్యవధిలో ఎడపల్లి మండలంలో దుండగులు పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ ఎత్తుకెళ్లారు.

- 8లో ▸



అర్బన్ పార్క్ అభివృద్ధికి కృషి

చిన్నాపూర్ వద్ద ఉన్న అర్బన్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు.

-8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.5 /23.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పంట వివరాల నమోదును ఆలస్యం చేయొద్దు



డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను ఆలస్యం చేయొద్దని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ ఏఈవోలను ఆదేశించారు. మండలంలోని దత్తాపూర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల వివరాలను సీబీఈ యాప్ ద్వారా పరిశీలించారు. సర్వే నంబర్లలో నమోదు చేసిన పంటల వివరాలు సరిగా ఉన్నాయా? లేదా? అని చూశారు. పంటల్లో చీడ పురుగులను నివారించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేయాలన్నారు. రుణమాఫీ విషయంలో రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జోత్స్నభవానీ, ఏఈవోలు మౌనిక, విజయ్ ఉన్నారు.

గ్రామాల్లో ప్రగతి సాధిద్దాం



నందిపేట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తూ గ్రామాల్లో ప్రగతి సాధిద్దామని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంతోపాటు ఆంధ్రనగర్ గ్రామంలో నిర్వహించిన 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నందిపేటలోని కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఈ నెల 9వ తేదీ వరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మండల ప్రత్యేక అధికారి జగన్నాథచారి, ఎంపీడీవో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

నిజామాబాద్‌అర్బన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ (పది నెలల రెసిడెన్షియల్) కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో 11వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 10గంటల నుంచి అనుమతిస్తారని, పరీక్ష ప్రారంభమైన తరువాత అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు చేసుకునేందుకు స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ www.tsstudycircle.co.in ను సందర్శించాలని సూచించారు.

కృష్ణ జింకపై కుక్కల దాడి

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఘటన



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతమైన మండలంలోని అన్నారం గ్రామ శివారులో కృష్ణ జింకపై కుక్కల గుంపు దాడి చేసింది. స్థానికులు కుక్కలను తరిమేసి తీవ్రగాయాలపాలైన జింకను గ్రామంలోకి తీసుకొచ్చి అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పశువైద్యాధికారి ధర్మాజీ, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన జింకకు చికిత్స అందించారు. అనంతరం జింకను చిన్నాపూర్ అర్బన్ పార్క్‌కు తరలించారు. ప్రతి ఏడాది కుక్కల దాడిలో జింకలు మృత్యువాత పడుతున్నప్పటికీ కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

వెన్ను వంచుతున్న బ్యాగులు



గంపెడు పుస్తకాల బరువు ప్రాథమిక స్థాయి విద్యార్థుల వెన్ను వంచుతోంది. దీంతో బాల్యంలోనే అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల బ్యాగుల బరువు తగ్గించేందుకు రాష్ట్ర విద్యాశాఖ 2017 లో మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ మార్గదర్శకాల ప్రకారం 1, 2 తరగతులకు 1.5 కిలోలు, 3 నుంచి 5 వ తరగతి వరకు 3 కిలోలు, 6, 7 తరగతులకు 4 కిలోలు, 8, 9, 10 వ తరగతులకు 5 కిలోల బరువు ఉండాలి. అయితే ఎక్కడా అమలు కావడం లేదు. విద్యాహక్కు చట్టాన్ని పటించుకోకుండా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారం సొంత సిలబస్‌తో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ సంఖ్య పెంచుతున్నాయి. పరిమితికి మించిన పుస్తకాల బరువుతో పాటు టిఫిన్ బాక్స్, వాటర్ బాటిళ్లు, బూట్లు తదితర వస్తువులు చిన్నారులకు మరింత భారంగా మారాయి. గతంలో ఆరు సబ్జెక్టులతో పాటు ఒక రఫ్ నోటు బుక్ ఉండేది. ప్రస్తుతం సబ్జెక్ట్ కు ఒక రఫ్ బుక్ తో పాటు గైడ్లు, ప్రాజెక్ట్ వర్క్, డ్రాయింగ్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలు మొదలైన వాటితో కిలోల కొద్ది బరువుతో స్కూల్ బ్యాగు మోయాల్సి వస్తోంది. దీంతో చిన్నారులు వెన్ను నొప్పి, జాయింట్ పెయిన్స్‌తో ఇబ్బందులు పడుతున్నారు. – భీమ్‌గల్

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

నిజామాబాద్‌నాగారం: జిల్లా విద్యుత్‌శాఖ పనుల విషయంలో అధికారులు, ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే నేరుగా టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా 92810 33233కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచి వాణిజ్య పద్ధతులు, మంచి వ్యాపార నీతిని అనుసరించి వాటాదారులందరికి సహేతుకమైన రాబడిని అందించడంలో టీజీఎన్‌పీడీసీఎల్ తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. అలాగే అవినీతి రహిత వ్యవస్థ ఏర్పాటుకు నిబద్ధతతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. 'లంచం ఇవ్వకండి మాకు సమాచారం ఇవ్వండి', 'లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరం' అని తెలిపే వాల్‌స్టికర్లు, ఫోన్ నంబర్లను అన్ని కార్యాలయాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సార్లకు సంక్షేమం పట్టదు

- రోజుల తరబడి హాస్టళ్ల ముఖం చూడని వార్డెన్లు
- గాడితప్పిన సంక్షేమ వసతిగృహాలు
- జ్వరాలబారిన పడుతున్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో సంక్షేమ వసతిగృహాల పర్యవేక్షణ కరువైంది. వార్డెన్లు రోజులతరబడి హాస్టళ్ల వైపు వెళ్లకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సౌకర్యాలపై దృష్టి సారించింది లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వార్డెన్లు హాస్టళ్లకు వెళ్లకుండానే కింది స్థాయి సిబ్బందితో నడిపిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్థానికంగా ఉంటూ విద్యార్థులకు అందించే భోజనం, స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించడంతో పాటు హాస్టళ్ల పరిసరాలు, భవనాలను పరిశీలన తదితర పనులు చేయాల్సి ఉండగా.. ఇవేమీ పట్టించుకోవడం లేదు.

వార్డెన్లు రోజుల తరబడి సంక్షేమ హాస్టళ్ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. వార్డెన్‌ల తీరును నిరసిస్తూ విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నా.. వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నా పరిస్థితిలో మార్పురావడం లేదు. ప్రస్తుతం విద్యార్థులు జ్వరాల బారినపడి ఇళ్లకు వెళ్లిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.





జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థుల గది తలుపు దుస్థితి

వెంటాడుతున్న విషజ్వరాలు

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను విషజ్వరాలు వెంటాడుతున్నాయి. కొందరు వార్డెన్లు హాస్టళ్లకు సరిగా రాకపోవడంతో విద్యార్థులు వైరల్ జ్వరాలు, డెంగీ బారిన పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మూత్రశాలలు, హాస్టళ్ల గదులు అస్తవ్యస్తంగా ఉండడం, అపరిశుభ్ర వాతావరణం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలతో బాధపడుతూ ఇప్పటికే సగం మంది విద్యార్థులు ఇళ్లబాటపట్టారు. ఇదిలా ఉండగా, నిధులు లేవనే సాకును చూపుతూ అధికారులు తప్పించుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తేనే సంక్షేమహాస్టళ్లు గాడినపడతాయని అంటున్నారు.

సంక్షేమాన్ని మరిచిన సంరక్షకుల్లో కొందరు..

- ❖ రెంజల్ మండలంలోని ఓ వసతి గృహం అధికారి గత 15 రోజులుగా విధులకు వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. గతంలో విద్యార్థులతోపాటు స్థానికులు సదరు అధికారి తీరును నిరసిస్తూ రోడ్డెక్కారు.
- ❖ నగరంలోని మహిళావసతి గృహం అధికారిణి నెలల తరబడి హాస్టల్‌కు వెళ్లడం లేదు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి సెల్‌ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ విద్యార్థినులు టీవీ చూడాలంటే ఒక్కొక్కరు రూ.20 చొప్పున వార్డెన్‌కు చెల్లించాల్సి ఉంటుంది. వంటలు బాగుండడం లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు.
- ❖ కంఠేశ్వర్ ప్రాంతంలోని మరో వసతిగృహం అధికారిణి 15 రోజులకోసారి వచ్చి వెళ్తుంటారు. విద్యార్థులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు లేదు. హాస్టల్ ప్రధాన రోడ్డుపై ఉండడంతో ఇక్కడ ఆకతాయిలు ఎక్కువగా తిరుగుతుంటారు. హాస్టల్ పర్యవేక్షణ మాత్రం నామమాత్రంగానే ఉంది.
- ❖ ఆర్మూర్‌లోని వసతిగృహం అధికారి నెలలో రెండు, మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతుండగా, సీనియర్ అయిన వంటమనిషి అన్ని బాధ్యతలు చూసుకుంటున్నారు. ఈ ప్రాంతంలోని మరో మహిళావసతి గృహంలో ఇదే పరిస్థితి నెలకొంది.
- ❖ హైదరాబాద్ రోడ్డులోని ఓ వసతిగృహం అధికారి హైదరాబాద్‌లో ఉంటూ హాస్టల్ కార్యకలాపాలను వంటమనిషి ద్వారా పర్యవేక్షిస్తున్నారు.
- ❖ నగరంలోని హమాల్‌వాడిలో ఉన్న ఓ వసతి గృహం అధికారి సైతం వారంలో ఓ రోజు మాత్రమే విధులకు హాజరవుతున్నారు.

జిల్లాలో వసతి గృహాలు

	విద్యార్థులు
ఎస్సీ హాస్టళ్లు 42	3556
బీసీ హాస్టళ్లు 33	2800
ఎస్టీ హాస్టళ్లు 08	1500

పకడ్బందీగా పర్యవేక్షణ

జిల్లాలోని వసతిగృహాలను పకడ్బందీగా పర్యవేక్షిస్తాం. సమస్యలు ఉంటే పరిష్కారిస్తాం. విధులకు గైర్హాజరయ్యే వార్డెన్‌లపై చర్యలు తీసుకుంటాం. వార్డెన్లు తప్పనిసరిగా వసతిగృహాలను పర్యవేక్షించాలి. స్థానికంగా అందుబాటులో ఉండాలి.

– నిర్మల, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారిణి

వైద్యులతో దురుసుగా ప్రవర్తించొద్దు

- బోధన్ జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టులు, సీనియర్ వైద్యులను నియమిస్తాం
- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



అవసరమైన మందుల వివరాలను ఎమ్మెల్యేకు అందజేస్తున్న వైద్య సిబ్బంది

బోధన్ టౌన్(బోధన్) : చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చే రోగులు వైద్యులతో దురుసుగా ప్రవర్తించొద్దని, సంయమనం పాటించి వైద్య సేవలు పొందాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని శక్కర్‌నగర్ బస్తీ దవాఖానాను బుధవారం ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టులతోపాటు సీనియర్ వైద్యులను త్వరలో నియమిస్తామన్నారు. బస్తీ దవాఖానాలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. మందుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మున్సిపల్ కౌన్సిలర్ చేతిలో అత్యాచారానికి గురైన బాలికను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఏసీపీ శ్రీనివాస్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అఘాయిత్యాలకు పాల్పడేవారిని ఉపేక్షించొద్దని ఎమ్మెల్యే అన్నారు. బాధిత కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశిస్తామని, బాధితురాలి విద్యార్హత మేరకు ఏ స్కూల్‌లోనైనా ఆయాగా అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. నిందితుడైన రాధాకృష్ణకు కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధం లేదని, దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. బాధితురాలికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, కౌన్సిలర్లు మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్, శ్రీకాంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు దాము, ఆదినారాయణ, వహీద్, విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి



యువజన కమిటీ, భజనమండలి సభ్యులను సన్మానిస్తున్న ఈరవత్రి అనిల్

నిజామాబాద్‌నాగారం: పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ అన్నిరంగాల్లో రాణించాలని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కండేయ మందిరంలో నగర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భజన మండలి, జిల్లా, నగర యువజన కమిటీ సభ్యులను సన్మానించారు. అనంతరం సంఘం సభ్యులు ఈరవత్రి అనిల్‌ను ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులు, ఆయా తర్పల అధ్యక్షులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అధ్యక్షుడు గుజ్జెటి వెంకటనర్సయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర సంఘం ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, ఉపాధ్యక్షుడు అవధూత దశరథం, ప్రముఖ ఛాతివైద్య నిపుణుడు బొద్దుల రాజేంద్రప్రసాద్, మెరుగు నాగరాజు, వెంకట్‌నర్సయ్య, కైరంకొండ విఠల్, గుండయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో..

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండా లక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని చేనేత సహకార సంఘంలో కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెంట దత్తాద్రి, సహకార సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్ఆర్ సత్యపాల్, కమిటీ సభ్యులు బిల్లా మహేశ్, బీమర్తి రవి, బొట్టు వెంకటేశ్, సురేందర్, గంగరాజు, మనోహర్, ధరమ్‌వీర్, బూస శ్రీనివాస్, దోర్నాల రాజు, లోల రాజేందర్, గంగుల విజయ్, బూస రవి, కోడూరు నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

కాలువలకు ఎస్సారెస్పీ నీటి విడుదల

- రైతు ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



కాకతీయ కాలువలో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ, లక్ష్మి కాలువలకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల కోసం రైతులను బలిచేయొద్దని, వారి ప్రయోజనాలను పక్కనపెట్టి రాజకీయాలు చేయొద్దని అన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవం కోసం రూ.90 వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంపై కాంగ్రెస్ నాయకులు కావాలనే రాజకీయం చేశారని విమర్శించారు. రూ.4 వేల కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 84 పిల్లర్లలో కేవలం రెండు పిల్లర్లలో సమస్య వస్తే దానిపై దుష్ప్రచారం చేశారన్నారు. కేసీఆర్‌కు పేరు రావొద్దనే కుట్రలతో కాళేశ్వరంపై అబద్ధపు ప్రచారం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్ మేరకు కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారన్నారు. కొట్టుకు పోయిందని ప్రచారం చేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి ఇప్పుడు నీళ్లు ఎలా వస్తున్నాయో కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పాలన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని తాను కోరగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెబితే నీటిని విడుదల చేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం బేషజాలకు వెళ్లిందన్నారు. రైతుల కోసం తానే గేట్లు ఎత్తుతానని అధికారులకు చెప్పడంతో ప్రస్తుతం నీటి విడుదల చేపట్టారని పేర్కొన్నారు. నీటి విడుదల కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని ఆహ్వానించామని, రైతుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకులతో కలిసి పని చేసేందుకు తనకు ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు కూడా వెంటనే నీటి విడుదల చేపట్టాలన్నారు. ఆయకట్టు రైతులు ప్రతి నీటి చుక్కనూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, ఈఈ చక్రపాణి, జెన్‌కో చీఫ్ ఇంజినీర్ రమేశ్‌బాబు, ఎస్ఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 1000 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 50, సరస్వతి కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు పోతుండగా, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1087.80(47టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించలేదు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల సందర్భంగా సంబంధిత అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. పోచంపాడ్ అతిథిగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలువల ద్వారా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తున్నామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితోపాటు కార్పొరేషన్‌ల చైర్మన్లుగా ఉన్న తనతోపాటు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డికి కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో డీసీసీ డెలిగేట్ జైడి రవి, నాయకులు బద్దం సాగర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోచంపాడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

సరస్వతి కాలువకు..



సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌నుంచి సరస్వతి కాలువకు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నీటిని విడుదలను ప్రారంభించారు. రైతులు అధికారులకు సహకరించాలని, నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

కాకతీయకాలువ ద్వారా నీటి విడుదల ప్రారంభం కావడంతో స్థానిక జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జెన్‌కో అధికారులు ఉత్పత్తిని ప్రారంభించారు. కాలువ ద్వారా మొదటగా వెయ్యి క్యూసెక్కులు వదలడంతో ఒక్క టర్బయిన్ ద్వారా 5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు. కాలువ ద్వారా క్రమంగా నీటి విడుదలను పెంచితే విద్యుత్ ఉత్పత్తిని సైతం పెంచుతామని జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు.

క్లుప్తంగా

ఉమారాణికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి ఆర్ ఉమారాణి డాక్టరేట్ బుధవారం సాధించారు. డాక్టర్ రావులపాటి మాధవి పర్యవేక్షణలో 'ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఆగెనెస్ట్ సెక్సువల్ అరాస్‌మెంట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ యునైటెడ్ హైదరాబాద్' అనే అంశంపై ఉమారాణి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ సీతాకుమారి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. అనంతరం డాక్టరేట్ సాధించిన ఉమారాణిని అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి కె ప్రసన్నరాణి, కంట్రోలర్ ఎంఅరుణ, బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా, అధ్యాపకులు బి స్రవంతి, ఎం నాగజ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలకు 22 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో బుధవారం 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. తెయూ మెయిన్ క్యాంపస్, భిక్కనూర్ సౌత్‌క్యాంపస్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్(కామారెడ్డి), ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(బాన్సువాడ)లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 1, 3, 4, 7, 9వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 212 మందికి 190 మంది హాజరు కాగా 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం తెయూ మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షల్లో 14 మందికి 13 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం రెండో రోజు ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 36 మందికి 36 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ఒక్కరికి గాను ఒక్కరు హాజరైనట్లు తెలిపారు.

మాక్ ఇంటర్వ్యూతో భయం తొలగిపోతుంది



తెయూ(డిచ్‌పల్లి):మాక్ ఇంటర్వ్యూలతో విద్యార్థుల్లో భయం తొలగిపోతుందని తెయూ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి, ఈవెంట్ మెంటార్ సీహెచ్ ఆంజనేయులు పేర్కొన్నారు. తెయూ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాఫ్ట్‌స్కిల్ డెవలపర్ జె శ్రీకాంత్ విద్యార్థులను మాక్ ఇంటర్వ్యూ చేశారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈవెంట్ మేనేజర్లుగా అమృత్‌చారి, శ్రావణి, శ్రీజ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, అధ్యాపకులు కె అపర్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

బాల్కొండలో సైబర్ మోసం

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన దేవ పద్మారావు సైబర్ మోసానికి గురయ్యారు. ఎస్సై యాసర్ అరాఫత్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దేవ పద్మారావుకు టెలిగ్రాం నుంచి సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. మొదటగా వారు YUM recipes నందు ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే మంచి లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పారు. వారి మాటలు నమ్మిన పద్మారావు విడతల వారీగా రూ. 67,715 నగదు పంపించాడు. కానీ ఎలాంటి లాభాలు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాపర్ కేటుగాళ్లు..

- వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రత కరువు
- చోరీకి గురవుతున్న కాపర్ వైరు
- విద్యుత్ శాఖ, రైతులకు నష్టమే..
- పట్టించుకోని పోలీసులు



ఏఆర్పీ గ్రామంలో ఎస్సై వంశీధర్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతులు(ఫైల్)



ఎడపల్లి శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

ఎడపల్లి: కన్నేశారా చోరీ చేయాల్సిందే. కటిక చీకట్లలోనూ కాపర్ కొట్టేయాల్సిందే. కాదూ కూడదంటే విద్యుత్ వైర్లనయినా దిగమింగేయాల్సిందే.. ప్రాణాంతకమని తెలిసినా విద్యుత్ వైర్లతో సయ్యాట లాడతారు. అర్ధరాత్రి మొదలు కోడి కూసేలోపు గప్‌చుప్‌గా ఎత్తుకుపోతారు. పాత ట్రాన్స్‌ఫార్మర్లపై కన్నేసే దుండగులకు ఊరికి దూరంగా ఉన్న పొలాలే టార్గెట్. 10–20 ఏళ్ల కింద అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లయితే అందులో 10 నుంచి 14 కేజీల దాకా కాపర్ దొరుకుతుంది. మార్కెట్‌లో దాని విలువ సుమారు రూ. 2500 ఉంటుంది. కొత్తవాటిలో ఉన్న కాపర్ వైరుకు మార్కెట్‌లో రూ. పదివేల వరకు ఉంటుంది. దీంతో దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. రూ. లక్షలు పోసి పంట బాగుకు కొన్న ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అవుతుండడంతో బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎడపల్లి మండలంలోని గడిచిన నెల రోజుల వ్యవధిలో దుండగులు పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించారు. దీంతో రైతులకు, విద్యుత్ శాఖకు విపరీతమైన నష్టం వాటిల్లుతోంది. తాజాగా సోమవారం రాత్రి ఎడపల్లి శివారులో మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. ఇలా నెల రోజుల వ్యవధిలోరు మండలంలోని ఠానాకలాన్, పోచారం, కుర్నాపల్లి, దూపల్లి గేట్ ప్రాంతాల్లోని పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జరిగిన 15 ఘటనలను పరిశీలిస్తే రూ. 15 లక్షలు విద్యుత్‌శాఖకు, రైతులకు నష్టం వాటిల్లిందనే చెప్పొచ్చు. మండలంలోని ఏఆర్పీ గ్రామానికి వచ్చిన ఎస్సై వంశీధర్‌రెడ్డికి స్థానిక రైతులు సమస్యను విన్నవించారు.

ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: జనగామ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాద దంపతులపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. బాధితురాలి వివరాలు తెలుసుకోడానికి పీఎస్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృత్‌రావు, కవితలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ ఆరోపించారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులపై దాడికి పాల్పడిన పోలీసులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి రాజు, ప్రధాన కార్యదర్శి వసంతరావు, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, న్యాయవాదులు దోస్‌పాల్ సురేష్, నరేందర్ రెడ్డి, పరుచూరి శ్రీధర్, బిట్ల రవి, నారాయణ, పులి జైపాల్, పుణ్యరాజ్, గోవర్ధన్, సత్యనారాయణ గౌడ్, హన్మంత్ రెడ్డి, గణేశ్, భిక్షపతి చెన్యా నాయక్, అంజలి మాణిక్‌రాజ్, ఆశ నారాయణ పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ పర్యటన



భీమ్‌గల్: పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ అంకిత్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల్లో తిరుగుతూ జెడ్పీ పాఠశాలలోని పరిసరాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పట్టణంలో ఎక్కడా చెత్తలేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్లు,మున్సిపల్,మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని రూపొందించిన పోస్టర్లను అడిషనల్ కలెక్టర్ అంకిత్ తన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎస్‌కే రసూల్‌బీ, డిచ్‌పల్లి, నిజామాబాద్ సీడీపీవోలు స్వర్ణలత, నందిని, సూపరింటెండెంట్ ఇందిరా, సీనియర్ అసిస్టెంట్ పద్మారాణి, కార్తీక్, సూపర్‌వైజర్లు ప్రియ, మంజుల, పోషణ అభియాన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిట్‌నెస్ పరీక్షలు



నిజామాబాద్‌అర్బన్: కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత్ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి కార్యక్రమం విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ జయసింహగౌడ్ తెలిపారు. ఈ ఎంపికలు స్పోర్ట్స్ అథారిటీ కబడ్డీ కోచ్ శ్రీనివాస్ రావు, అథ్లెటిక్స్ కోచ్ సుబ్బారావు పర్యవేక్షణలో చేపట్టారు. సుమారు 300 పైగా విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన హెచ్‌ఎం కిషన్‌ను సస్పెన్షన్ చేస్తూ డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 3న పాఠశాలలో విద్యార్థులకు కారంపొడితో భోజనం పెట్టిన ఘటనపై విచారణ చేపట్టిన డీఈవో మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దుచేశారు. అనంతరం విచారణ చేపట్టగా హెచ్‌ఎం కిషన్, మరో ఇద్దరు టీచర్ల ప్రమేయంపై ఆరా తీశారు. దీంతో హెచ్‌ఎంను సస్పెండ్ చేయగా, ఇద్దరికి మెమోలు జారీ చేశారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

బాన్సువాడ రూరల్: మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో బుధవారం కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్, సివిల్ సప్లయ్ ఇన్‌చార్జి డీఎం నిత్యనందంతో కలిసి రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు.

మోర్తాడ్‌లో చైన్‌స్నాచింగ్

మోర్తాడ్: మండలంలోని వడ్యాట్ శివారులో ఓ ఉపాధ్యాయురాలిపై ఓ దుండగుడు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఎస్సై అనిల్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. టి శ్రావణి అనే ఉపాధ్యాయురాలు విధులు ముగించుకొని గ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మొకానికి మాస్క్ ధరించి ఆమె మెడలో ఉన్న తులంన్నర బంగారం చైన్‌ను లాక్కొని వెళ్లారు. ఉపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

చెట్టును ఢీకొన్న బైక్ ఘటనలో ఒకరు..

సిరికొండ: మండలంలోని కొండూర్ సమీపంలో చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన వాగ్మరే రాజు(32) పదేళ్లుగా పెద్దవాల్గోట్‌లో మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి అతని స్నేహితుడు వీరనర్సింహారెడ్డితో కలిసి బైక్‌పై పెద్దవాల్గోట్ నుంచి సిరికొండ వైపు వెళ్తున్నారు. కొండూర్ సమీపంలో వీరి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో రాజు తలకు తీవ్రగాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలున్నారు. ఘటన స్థలాన్ని ధర్పల్లి ఎస్సై విక్రం, ఏఎస్సై దుర్గాప్రసాద్, ఎస్‌హెచ్‌వో మధుకర్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..

భిక్కనూరు: మండలంలోని కంచర్లలో విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మట్టి స్వామి(37) అనే రైతు తన పొలంలో పంటకు నీరు పెట్టేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. రాత్రి 10 అయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి లింగారెడ్డి కుటుంబీకులతో కలిసి పొలానికి వచ్చి చూడగా మృతి చెంది ఉన్నాడు. స్టార్టర్ బాక్స్‌లో వైరు సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నవీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నవీపేటకు చెందిన పల్లె నారాయణ(65) బుధవారం మృతి చెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రోడ్డుపై కాలినడకన వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొందన్నారు. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాధవనగర్‌లో మరొకరు..

నిజామాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మాధవనగర్ చెందిన శాకంపల్లి నారాయణరెడ్డి(65) బుధవారం మృతి చెందాడు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాధవనగర్ చెందిన నారాయణరెడ్డి గత నెల 25న రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా మాధవనగర్ నుంచి వినాయకనగర్ వెళ్తున్న ఓ బైక్ ఆయనను ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నారాయణరెడ్డిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి 15 రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్ విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. బుధవారం మద్యం తాగి వాహనం నడిపిన 37 మందికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. కౌన్సెలింగ్ తర్వాత వీరిని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 34 మందికి రూ. 89 వేల జరిమానా విధించారు. జక్రాన్‌పల్లికి అజ్మీరా గణేశ్, ఎడపల్లికి చెందిన మహమ్మద్ షౌకత్ అలీ, డిచ్‌పల్లికి చెందిన భగవత్ మోజీరామ్‌లకు జైలు శిక్ష విధించారు.

ఒకరిపై కేసు నమోదు

ఇందల్వాయి: పోలీస్‌స్టేషన్‌లో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు చేసినట్లు ఎస్సై మనోజ్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సిర్నపల్లికి చెందిన వడ్ల నాగరాజు తన తమ్ముడికి చెందిన ఓ కేసు విషయంలో స్టేషన్‌కి వచ్చి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటం కలిగించిన నేరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విక్రం బుధవారం తెలిపారు. గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిన వివాహిత తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించి నా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్‌పై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి సుమారు 270 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రైస్‌మిల్‌కు మహారాష్ట్ర నుంచి బియ్యం లోడ్‌తో వచ్చినట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ పురుషోత్తం బుధవారం తెలిపారు. అనంతరం సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు.పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

అర్బన్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తా

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



అర్బన్‌పార్క్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

మాక్లూర్: అర్బన్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో ఉన్న చిన్నాపూర్ గండి వద్ద ఉన్న అర్బన్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. భవిష్యత్ తరాలు చెప్పుకునే విధంగా తెలంగాణలోనే నంబర్ వన్ పార్కుగా రూపు దిద్దటానికి తనవంతుగా కృషి చేస్తానని, అందుకు అటవీశాఖ సహకారం కూడా ఉండాలన్నారు. అనంతరం పార్క్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, నాయకులు గంగోనే సంతోష్, అనిల్‌కుమార్, బడుగు సత్యం, వి సుబ్బారావు, పీర్‌సింగ్, రమావత్ సురేష్‌నాయక్, ప్రసాద్, మ్యాతరి రాజు, చిన్నాపూర్ వినోద్, బి రాములు, రాజు, అటవీశాఖ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ అధికారులు అశోక్, సుధాకర్, శ్రీదేవి, గణేశ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



పాఠశాలలో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే

ఎడపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పులిశ్రీనివాస్ జన్మదినం సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి కొరత తీర్చాలని ఉపాధ్యాయులు కోరగా విద్యార్థులల సౌకర్యార్థం బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి జన్మదినం సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రాంమోహన్, నాయకులు కామప్ప, బొబ్బిలి శ్రీనివాస్, రాధాకిషన్ గౌడ్, హన్మంత్‌రెడ్డి, బలరా, నారాయణ, కృష్ణారావు, భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులు చిన్న పిల్లలతో సమానం

- జిల్లా సంక్షేమాధికారి ఎస్‌కే రసూల్‌బీ



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: మానసిక దివ్యాంగులు చిన్న పిల్లలతో సమానమని జిల్లా సంక్షేమాధికారి ఎస్‌కే రసూల్‌బీ అన్నారు. నగరంలోని మారుతినగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టిస్, ఎంపవర్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ప్రోద్బలంతో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారి రసూల్ బీ, సీనియర్ వైద్యనిపుణులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సురేష్ కుమార్ హాజరై మాట్లాడారు. పిల్లలు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఎంతోమంది దివ్యాంగులు ఉన్నత స్థాయిలో రాణించారని తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని అన్నారు. కార్యక్రమంలో న్యూరో సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు విష్ణువర్ధన్, నవజాత శిశు వైద్య సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు సాధన, మానసిక వైద్య నిపుణులు వికాస్, స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కార్యదర్శి ఎస్ సిద్ధయ్య, కార్పొరేటర్ మీసాల సవితశ్రీనివాస్ మ్యాజిక్ షో రంగనాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యం

బోధన్: తల్లీ పాలే బిడ్డకు ఆరోగ్యమని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పట్టణంలోని రాకాసిపేట్‌లో ఆర్కే లక్ష్మి పిల్లల ఆస్పత్రి వైద్యుడు దీపక్ రాథోడ్ సహకారంతో ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్ట్ స్థాయి తల్లీపాల వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యుడు దీపక్ రాథోడ్ తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. వెల్ బేబీ షో, చిన్నారులకు అన్న ప్రాసన, వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. సీడీపీవో జానకీ, సమత, నిర్మల, రాధిక, ప్రమీల రాణి, శ్రీలత, వనజ, ఆసియాబేగం, సుమలత, మణి, సౌజన్య, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



వెల్ బేబీ షోలో చిన్నారుల తల్లులు, అధికారులు

పది గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



ఏఈ, విద్యుత్ సిబ్బందితో గ్రామస్తులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప, బాడ్సి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి సమయంలోనూ వెంటనే స్పందించిన ఏఈ బాబా శ్రీనివాస్.. 33 కేవీ లైన్‌లో ముదక్‌పల్లి వద్ద ఫీడర్ బ్రేక్‌డౌన్ అయినట్లు గుర్తించారు. రైతుల సహకారంతో పొలం గెట్ల మీదుగా వెళ్లి అర్ధరాత్రి 12 గంటల వరకూ అక్కడే ఉండి సమస్యను పరిష్కరించారు. చిన్నాపూర్, సింగంపల్లి, బైరాపూర్, కాల్పోల్, ఎల్లమ్మకుంట, అమ్రాబాద్ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రాత్రి సమయంలోనూ విద్యుత్ అధికారులు స్పందించడంతో ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు. ఏఈ వెంట లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్లు మురళి, చందర్, శ్రీనివాస్, జేఎల్‌ఎంలు సంజీవ్, మహేశ్, నరేశ్, రైతులు ఉన్నారు.

లేగదూడపై చిరుత దాడి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



చిరుత పాదముద్ర

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లి శివారులో ఉన్న పశువుల కొట్టంలో లేగదూడపై చిరుత దాడి చేసింది. ఇందల్వాయి అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోట మనోజ్‌కుమార్ పశువుల కొట్టంలో లేగదూడపై మంగళవారం రాత్రి చిరుత దాడి చేసింది. ఉదయం లేచి చూసేసరికి లేగదూడ మరణించి ఉండటం, చిరుత అడుగులు కనిపించడంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వినయ్, శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని పశువుల కొట్టాన్ని పరిశీలించారు. మట్టిలో ఉన్న పాదముద్రలను బట్టి చిరుతనే అని ప్రాథమికంగా నిర్ధారించారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నందున రైతులు, ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచించారు. చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుతను పట్టుకుని దూరంగా వదిలేయాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం మానేయమన్నందుకు ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మద్యం మానేయమన్నందుకు ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ మండలం బీమదేవరపల్లికి చెందిన జింక శ్రీకాంత్(36) బతుకుదెరువు నిమిత్తం భార్య, పిల్లలతో కలిసి జిల్లా కేంద్రంలోని జెండాగల్లీలో నివాసం ఉంటున్నారు. శ్రీకాంత మద్యానికి అలవాటు పడడంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. మంగళవారం రాత్రి సైతం మందు తాగొద్దు అన్నందుకు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.